

# అనగనగా... ఒక కథ

## కీర్తి కాయుడు

**వెంకటశాస్త్రిగారు చనిపోయాడుట!!**

**ఇంకో గంటలో శవాన్ని లేపేస్తారు!!**

అయినవాళ్లకి... అంటే ఆయన మీద గురీ భక్తీ ఉన్నవాళ్లకి కబురందుతోంది!

ఎల్లుండి మా నాన్న ఆబ్దీకం అని నిన్ననే గుర్తు చేస్తూ ఫోన్ చేశారు. ఏమేమి సరంజామా కొనాలో లిస్టు రాసుకోమని చెప్పారు- 'సరేనండి' అని తలూపుతూ ఫోన్‌లోనే బదులిచ్చాను.

ఇంతలో అవాంతరం-శాస్త్రిగారు మరణించారు.

'అయ్యోరామా' అనుకుంటూ అంతిమదర్శనం కోసం బైల్దేరాను. ఆయనంటే నాకు గౌరవం!

నాన్న, అమ్మ చనిపోయినప్పుడు శాస్త్రోక్తంగా కర్మకాండ ఆయనే జరిపించారు.

స్వర్గానికి మంత్రాల్తో మెట్లు కట్టి..చనిపోయిన వాళ్లని 12 రోజుల కర్మకాండతో, పన్నెండు నెలల మాసికాల్తోబాటు రౌరవాది మహానరకాలు దాటించడానికి జప, తప దానాదులు సాధికారికంగా చేయించారు. నవధాన్యాల్తోబాటు గోదానం, హిరణ్యదానం, దీపదానం, జలపాత్ర దానం, ఛత్రదానం, వస్త్రదానం వగైరాలు ఎన్నో చేయించి, వాళ్లకి స్వర్గారోహణ పర్యంతం కావాల్సినవన్నీ అర్థవివరణ చేస్తూ మంత్రోచ్చారణతో చేయించేవారు.

పార్థివ దేహానికి స్నానపూజాదికాలు-దహనం-నిత్యకర్మ-దశాహం-ధర్మోదకాలూ-ఏకాదశాహం-ద్వాదశ దిన క్రియ అన్నీ చేసి...మరణించినవాళ్లని పితృదేవతల సరసన నిలబెట్టేవారు.

అస్తికల నిమజ్జనం-పుణ్యావచనం మొదలైన 'మైల' పన్లన్నీ మామూలు బ్రాహ్మలు చేయరుట- అందుకనే వెంకటశాస్త్రిగారికి అంత డిమాండు- అంత బిజీ.

కానీ ఆయన ఆ తర్వాత కనిపించినా..పలకరించినా అశుభంగానే భావిస్తారు మా బంధువర్గం.

ఆయన పంక్తిబాహ్యుడుట. అంటే యాజ్ఞీకులతో కలిసి ఆయన భోజనం చేయకూడదుట. ఆయనే కాదు ఆయన భార్య, బంధువులూ అందరూ పుణ్యాలకీ, పూజలకీ, పేరంటాలకీ విందులకీ రాకూడదట!

''అసలు నీకు బుద్ధిలేదురా..ఆయనపోతే చూడ్డానికి పరిగెడతావా? నువ్వేవన్నా అతని కర్మకాండ నడిపిస్తావా ఏంటి'' మా బాబయ్య నా విచారానికీ ప్రయాణానికీ బ్రేకులేయడానికి ప్రయత్నించాడు.

''నేను వెళ్లడం తప్పా?'' నా మాట నోట్లోనే ఆగిపోయింది.

''అయినా..సాటివాడు..'' అన్నాను తెగించి.

''సాటి వాడు కాదు కాటివాడు'' బాబయ్య మాటలు నాకు చాలా అసహ్యంగా వినిపిస్తున్నాయి. ''అయినా ఇంత తొందరగా పరిగెట్టక్కర్లేదు. నాకు తెల్సి ఈ అపరకర్మలు చేయించే బ్రాహ్మడీ పదూళ్లలో ఇంకోడు లేడు. వాడెవడో దొరకాలి-వీణ్ణే లేపాలి. ఇంత అన్నం తిని పలకరించడానికి వెళ్లచ్చులే- అది..ఇప్పట్లో లేచే పీనుగ కాదు. పైగా చాలా తంతూ, తతంగం ఉంటుంది'' బాబయ్య నోటంట అలాంటి మాటలు రావటం నాకు చాలా చిరాగ్గా వుంది. జవాబు చెప్పకుండా బైల్దేరాను. నలుగురికీ అక్కర్లేని..నలుగురికి కావాల్సిన మనిషి ఆయన అనిపించింది.

బాబయ్యన్నట్లు ఆయనలాంటి ఉద్దండ పండితుడు ఈ పరిసరాల్లో ఉండడు-చేసేపని అర్థం తెలిసీ, దాన్ని తెలిపీ చేయించే వాళ్లు చాలా తక్కువ.

అపరాల్లోనే కాదు పరాల్లో కూడా-గుళ్లో అర్చకులు చేయించే పూజలూ...వివాహోపనయానాల విధులు చేయించే పురోహితులూ..చాలా కమర్షియల్‌గా కనిపించి వాటిమీదే గౌరవం లేకుండా చేస్తున్నారు-వాళ్లల్లోనే సిన్సియార్టీ లేకపోతే ఆచరించే వాళ్లకి ఎలా వుంటుంది? మన ధర్మాన్నీ మన మత సూత్రాల్నీ మనమే లక్ష్యపెట్టట్లేదు. ఇతర మతస్తుల్లో కొంతమంది శుక్రవారం, కొంతమంది ఆదివారం.. ఇలా ప్రార్థనాలయాలకి వెళ్లటం విధిగా ఆచరిస్తారు కదా. కానీ మనం..పుట్టినరోజునాడైనా, పెళ్లిరోజునాడైనా గుడికెళ్లి అష్టోత్తరం పూజ చేయడానికి కూడా మనస్కరించక ఇంట్లోనే సభక్తికంగా నమస్కరిస్తున్నాం.

దీనికి కారణం ఎవరు?

కడుపుచించుకుంటే కాళ్ల మీద పడ్డట్టు..ఒకే జవాబు 'మనమే'. భక్తిని ఉద్యమంగా భావించం! ఉద్యోగంలా చూస్తున్నాం- అందుకే దేవుణ్ని భమర్షియల్‌గా, పూజారిని కమర్షియల్‌గా అనుకుని..మనం రేషనిస్టులనుకునే నాస్తికులుగా తయారౌతున్నాం.

ఎక్కణ్నుంచి..ఎక్కడికో..ఊహలూ అభిప్రాయాలూ చెరో అడుగై లాక్కెళ్తున్నాయి..

కానీ కాళ్లు వెంకటశాస్త్రిగారి ఇంటి ముందు


పంచం మీదో..మరో ఎత్తుమీదో..ఉండి ప్రాణాన్ని కోల్పోకూడదు. అందుకే దర్భలో, గడ్డో వేసి ప్రాణం పోతూన్న వ్యక్తిని పార్థివ (పృధివి యొక్క) గతం చేస్తారు- అలా పృధివీ గతం అవుతుంది దేహం. ఆ తర్వాత..ఆపోగతం..అంటే నీటితో దేహశుద్ధి కోసం శవస్నానం! ఆ తర్వాత తేజో గతం..అంటే దహనం- ఆ తర్వాత జరిగేది..పొగలా వాయువు, తద్వారా..ఆకాశగమనం..ఇలా పంచభూతాల్లో విలీనమయ్యాక పరమాత్మ సమాగమం- నా ఈ జ్ఞాపకాలన్నీ వెంకటశాస్త్రిగారు చెప్పినవే... అమ్మా నాన్నా పోయినప్పుడు.

ఆగాయి.

వెంకటశాస్త్రిగారి ఇంటిముందు జనం గుమిగూడి లేరు.

బాబయ్య చెప్పింది కరక్ట్! ఇద్దరో ముగ్గురో నాలా ఆయనని ఇష్టపడే వాళ్లు మాత్రం ఉన్నారు.

ఉదయం కాఫీ తాగి పడక్కుర్చీలోనే ఊపిరి వదిలేశాడుట. పడక కుర్చీ కర్రలు లాగేసి, కుర్చీ గుడ్డని క్రిందకి పరిచేస్తే భూశయనం జరిగింది వెంకటశాస్త్రిగారికి-



వెంకటశాస్త్రిగారి మంత్రాల్లో దీనికి ప్రాయశ్చిత్తం తెలిపే మంత్రం ఉంటుంది. మంచం మీదో..మరో ఎత్తుమీదో..ఉండి ప్రాణాన్ని కోల్పోకూడదు. అందుకే దర్భలో, గడ్డో వేసి ప్రాణం పోతూన్న వ్యక్తిని పార్థివ (పృధివి యొక్క) గతం చేస్తారు- అలా పృధివీ గతం అవుతుంది దేహం. ఆ తర్వాత..ఆపోగతం..అంటే నీటితో దేహశుద్ధి కోసం శవస్నానం! ఆ తర్వాత తేజో గతం..అంటే దహనం- ఆ తర్వాత జరిగేది..పొగలా వాయువు, తద్వారా..ఆకాశగమనం..ఇలా పంచభూతాల్లో విలీనమయ్యాక పరమాత్మ సమాగమం- నా ఈ జ్ఞాపకాలన్నీ వెంకటశాస్త్రి గారు చెప్పినవే... అమ్మా నాన్నా పోయినప్పుడు.

ప్రస్తుతం ఆయన పృధ్వీగతంలో ఉన్నారు. ఏడుస్తూ ఉక్కిరిబిక్కిరైన శాస్త్రిగారి భార్య కోలుకొంది. కోలుకుని కర్తవ్య దీక్షాబద్ధ అయింది. ఆమె కన్నీళ్లు చీరకొంగులో ఇగిరిపోతున్నాయి.

''బాబూ!'' చూపులు నన్నే పిలుస్తున్నట్లు చూస్తున్నాయి.

''చెప్పమ్మా ఏంటి?'' దగ్గరకెళ్లాను.

''నా బిడ్డలు ఉద్యోగాల నిమిత్తం ఊళ్లలో ఉన్నారు'' ఆవిడ ఏడుపు ఆపుకుంటోంది.

''టెలిగ్రాం ఇద్దాం. ఎడ్రస్సుంటే...''

''అంత టైము లేదు'' అంటూ లోపలికెళ్లింది.

అరక్షణంలో ఒక కాయితంతో బైటకొచ్చింది.

అది శాస్త్రిగారి వీలునామా లాంటి..మరణ వాఙ్మూలం..లాంటి మరణశాసనం!

''నేను..చనిపోయిన వ్యక్తికి ఉత్తరగతుల కోసం కర్మకాండలు నిర్వర్తించాను. దేహ జీవ శాంతికై వేదోక్త విధి విధానాన్ని ఆచరింపజేశాను. ఎన్నో దానధర్మాలు శాసించి నడిపించాను.కానీ...

నేను ఉత్తర గతులని ఆశించటం లేదు. ఉత్తమ గతులని ఆకాంక్షిస్తూ..నా శరీరాన్ని వైద్య విద్యార్థుల విద్యాభివృద్ధికోసం దానం చేయాలని నిశ్చయించుకున్నాను. నా భార్య సమక్షంలో ఈ దేహాన్ని మెడికల్ యూనివర్శిటీకి దానం చేయండి!

వైద్య విధానంలో నా శరీరంలో ఏ శకలం వినియోగించినా ధన్యం!

ఇదే నేను పొందే స్వర్గం!

ఇదే నేను అనుసరించే ధర్మమార్గం!!

ఇదే నేను నమ్ముతూన్న నిత్య సత్య మార్గం!!''

నాకు కన్నీళ్లు తిరిగాయి. అర్జెంట్‌గా వెంకటశాస్త్రిగారి శరీరాన్ని మెడికల్ కాలేజీ మార్చ్యురీకి తీసుకెళ్లడానికి పరుగులెత్తాను.

దహనం- పన్నెండు రోజుల కర్మ.. రకరకాల దారుల్లోంచి దానాల్తో స్వర్గానికి మెట్లు వేసుకోవటం...వీటన్నిటికన్నా వెంకటశాస్త్రిగారు చేసిన దానం ఎంత గొప్పది అనిపించింది. స్వర్గంలోకి చేరటానికి ఆయన సార్థవంతంగా కట్టుకున్న మెట్లు కళ్లకు కట్టినట్లు కనిపించాయి. ఆయన కీర్తిశేషుడుకాదు కీర్తికాయుడు.

బాష్పాంజలితో యూనివర్శిటీవాళ్లు పంపిన అంబులెన్స్ ఎక్కించాను ఆయన్ని.

*